
# దేవుళ్ళు

ముసునూరి పేరయ్యశాస్త్రి



డ్రైవర్ తల సిగ్గుతో వాలిపోయింది. ఇంతవరకూ ఎవరినైతే మూర్ఖు లనుకున్నాడో, ఎవరిమీదైతే చిరాకు పడ్డాడో వారే ఇప్పుడు తన పాలిట దేవుళ్ళయేసరికి సిగ్గుగా అనిపించింది. అదే పరిస్థితి కండక్టర్‌ది కూడా !


జయలక్ష్మి థియేటర్ దాటి కాసేపు ప్రయాణించి పెంటపాడు బస్టాండ్‌లో అయిష్టంగానే బస్ ఆపాడు డ్రైవర్.

బస్టాండ్‌లో గుంపులు గుంపులుగా కూలి జనం. వాళ్ళందరూ బ స్సెకితే గందరగోళమే ననుకుంటూ - దిగవలసిన వాళ్ళు దిగిన వెంటనే, బస్ ముందుకు పోనివ్వబోయాడు గానీ, అప్పటికే కూలి జనం బస్ గేటును పట్టుకొని వేలాడుతున్నారు. పైగా కేకలు - అరుపులు డ్రైవర్‌కి బస్ ఆవక తప్పలేదు.

"లోప లంతా ఖాళీయే గదండీ!" బయటనుంచి అరుస్తున్నా డొకడు. 'ఎక్కండ్రా... ఎక్కండి' జనం హడావిడీ.

"పెతీ బస్సూ పోతా వుంటే మా గతేం కాను బాబయ్యో!" బాధగా అన్నా డొకడు. కొందరు ఎదురుతిరిగారు.

కండక్టర్ చికాగ్గా ముఖం పెట్టాడు. అః మిమ్మ ల్నెక్కించుకుంటే బస్ వెళ్ళినట్టే. వెనకాల ఇంకో బస్ ఖాళీగా వస్తోంది. అదెక్కండి" డోరులో ఉన్న




జనాన్ని గెంటుతూ అన్నాడు. తలుపు లాగుతూన్నాడు.

అయినా కూలి జనం వదల్లేదు. శక్తి కొలది లోపలికి తోసుకు వస్తున్నారు. పట్టి మనుషులే గాదు, తలో మనిషి నెత్తినా తలో పెట్టె "పోనీలేవయ్యా కండక్టర్, లోపల చో టుందిగా" లోపల్నుంచి ఓ పెద్ద మనిషి అన్నాడు.

"వీళ్ళతో పెద్ద చావండీ బాబూ" అని అంటూనే ఉన్నాడు, కూలి జనం లోపలికి తోసుకుంటూ వచ్చేశారు. కండక్టర్ గు ఢ్లప్పగించి చూస్తుండిపోయాడు.

"లోపలికి వెళ్ళండెహె! ఛీ.. ఛీ..." డ్రైవర్ చికాకు పడ్డాడు. తిట్టాడు, మూర్ఖు లన్నాడు. పశువుల మందన్నాడు. నడచి పోవచ్చు గదాన్నాడు. భాగా సంపాదించి బలిసిపోయా రన్నాడు.

ఏమంటే నేమి?

అందరూ బస్సెక్కేశారు. ఇక బస్‌లో కేకలు, అరువులు.

"ఒసేవ్! కుర్రా డేడే?" బస్ ముందునుంచో అరువు. ఆ అరువులోనే ఇంకొకరి అరువు.

"ఆఁ... ఈడ సున్నాడు" బస్ చివరినుంచి సమాధానం.

"ఓసీ నీయమ్మా! ఏటే కాల్లు తొక్కుతున్నావూ!" ఓ ముసలాయన కోపం మనవరాలిపై.

పిల్లల ఏడుపులు. తల్లుల అరువులు.

వాళ్ళందరి దగ్గరా టిక్కెట్లు తీసుకోవడం కండక్టర్‌కి పెద్ద సమస్య. తిడుతూ, గెంటుతూ టిక్కెట్లు కొడుతున్నాడు. డ్రైవర్ సరేసరి. పక్క నున్నవారిని బూతులే తిడుతున్నాడు వెనక్కి వెళ్ళండని.

చోటు లేక అవస్థ పడుతూ, తిట్లు తింటూ నిలబడ్డారు శివయ్య, గోపయ్యలు, తమ సాటి కూలి జనాన్ని అరవద్దంటూ అరుస్తున్నారు. బస్ వెడుతూనే ఉంది.

కాలేజీ కుర్రాళ్ళ హాలిడే టూర్ బస్‌లా, హడావిడిగా - గోలగా ఉందా బస్. పెంటపాడు తరువాత ముదునూరు దాటింది. చిలకంపాడులో బస్ ఆగలేదు. పిప్పర గ్రామం చేరబోతోంది. సరిగ్గా టూరింగ్ సినిమా హాలు ముందు సడన్ బ్రేకుతో బస్ ఆగింది. బయట జనం పరిగెత్తుకు వస్తున్నారు. బస్‌లో జనం గబగబా దిగారు. ముందు టైర్ కింద రక్తపు మడుగులో ఒక కుర్రాడు - అతనికి కొద్ది దూరంలో ముక్కలైన సైకిల్.

డ్రైవర్ పారిపోబోయాడు గానీ, పట్టుకున్నారు. కొంద రతనిని కొట్టబోయారు. కొందరు ఆపి 'పోలీసులే వీడి సంగతి చూస్తారు లెమ్మన్నారు. ఆ వార్త చుట్టుపక్కలకు పాకిపోయింది. కూలి జనం చనిపోయి పడున్న కుర్రాడిని చూసి బాధపడుతున్నారు.

కండక్టర్, డ్రైవర్ ప్రయాణీకుల [చదువుకున్న] దగ్గరకు వచ్చి, డ్రైవర్ తప్పు ఏమీ లేదన్న కాగితంపై సంతకాలు పెట్టమన్నారు.

"అమ్మో! సంతకాలు పెట్టి కోర్టుల చుట్టూ తిరిగే ఓపిక మాకు లేదు" అని అంతా తప్పించుకున్నారు.

బ్రతిమాలారు. జరిగిన విషయం డ్రైవర్ వివరించాడు. కుర్రాడిదే త ప్పన్నారు గానీ - ఎవరూ సంతకాలు పెట్టలేదు.

"ఛీ! ఛీ! ఆ కూలి జనం ఆపబట్టి గానీ - లేకపోతే ఈ ప్రమాదం జరిగి ఉండేది గాదు" అన్నాడు కండక్టర్.

కొందరు నిజమే అన్నారు. మరికొందరు నవ్వుకున్నారు.

ఇంతలో పోలీసులు రానే వచ్చారు. వివరాలు తెలుసుకోబోయారు. ఎందు కొచ్చిన గొడవని నాగరికులంతా అక్కడనుంచి చల్లగా జారుకున్నారు. కూలి జనం నేల మీద కూర్చుని కుర్రాడి గురించి మాట్లాడుకొంటున్నారు.

పోలీసులు డ్రైవర్ని తీసుకువెడుతుంటే, కూలి జనం మధ్య కూర్చున్న శివయ్య గమనించి లేచి వచ్చాడు.

"అదేం టండీ? అసలు డ్రైవర్ బాబు దేమీ తప్పు లేదు. ఆ కుర్రోడే బస్ ఎదురొత్తున్నాడు - చెయ్యి వదిలేసి సైకిల్ తొక్కుతున్నాడు. పాపం! డ్రైవర్ బాబు తప్పించాలనే సూసిండు గానీ కుదరలేదు. ఆయ న్దేమీ తప్పు లేదు. కావాలంటే రాసిత్త. ఆఁ..." అన్నాడు. కూలి జనం అందరూ అదే అన్నారు.

డ్రైవర్ తల సిగ్గుతో వాలిపోయింది. ఇంతవరకూ ఎవరి నైతే మూర్ఖు లనుకున్నాడో, ఎవరి మీదైతే చిరాకు పడ్డాడో, వారే ఇప్పుడు తన పాలిట దేవుళ్ళయ్యే సరికి సిగ్గుగా అనిపించింది. అదే పరిస్థితి కండక్టర్‌ది కూడా.

అక్కడ జరగవలసిన తతంగాన్ని పూర్తి చేసుకొని డ్రైవర్ని తీసుకు వెళ్ళొద్దంటున్న కూలి జనంతో, 'మీ వల్ల డ్రైవర్‌కి ఉపకారమే జరుగుతుంది. అయితే రూల్స్ ప్రకారం మేము తీసుకు వెళ్ళాలి' అని నచ్చచెప్పేసరికి పోలీసుల తల ప్రాణం తోకకు వచ్చింది.

పోలీసుల వెంట వెడుతున్న డ్రైవర్ని జాలిగా చూస్తూ నిలబడ్డారు కూలి జనం. ఆ కూలి జనాన్ని - వారి ఔన్నత్యాన్ని అంచనా వేయలేక పోయిన కండక్టర్, వారినే వింతగా చూస్తూ నిలబడిపోయాడు. ★

## హమేషా తమాషా

### దారం తెంపకుండా

ఒక మూరెడు పొడుగున్న దారాన్ని ప్రేక్షకులకి చూపించి, "ఈ దారం ముక్కని తెంపకుండా మూడు చెయ్యగలరా?" అని సవాలు చెయ్యి.

"తెంపకుండా అయితే అసాధ్యం!" అంటారు.

"అసాధ్యమైనది సాధ్యపడేలా చెయ్యడమే నా ప్రత్యేకత. జాగ్రత్తగా చూస్తూ ఉండండి" అని నేల మీద 3 అనే అంకె ఆకారంలో ఆ దారాన్ని మలుచు. అంతే కథ!

### ఉంగరంలో నుంచి రూపాయ కాసు

ఎవరి వేలి నుంచి అయినా ఉంగరం ఒకటి అడిగి తీసుకో. నీ జేబులో నుంచి రూపాయి కాసు తీసి మరో చేతిలో పట్టుకో.

"ఉంగరాన్ని పాడుచెయ్యకుండా రూపాయి కాసును వంచకుండా - ఈ ఉంగరం లోంచి ఈ రూపాయి కాసును తొయ్యగలరా మీలో ఎవరైనా?" అని సవాలు చెయ్యి.

ఆది అసాధ్యమైన పని అని అందరికీ తెలిసినా, ఎలా చేయడమా అని ఆలోచనలో పడతారు.

అప్పుడు నువ్వు ఇలా చేసి చూపించు.

రూపాయిని బల్ల మీద పెట్టు.

ఉంగరంలో నుంచి వేలు దూర్చి, ఆ వేలితో బల్ల మీద ఉన్న రూపాయి కాసును తొయ్యి. అంతే!

"ఓస్! ఇదా? ఇలా అయితే మేమూ చేయగలం ..." అంటారు కొందరు.

"చేయమనే కదా నేను అడిగిందీ!" అను.

డా. మహీధర నళినీమోహన్